క్లుప్తంగా

తపస్ మండలాధ్యక్షుడిగా నర్సింలు ఎన్నిక


నర్సింలు

పాపన్నపేట(మెదక్): మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) అధ్యక్షుడిగా మంగ నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా పైతర దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ తెలిపారు. గతంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉన్నవారు బదిలీల్లో వేరే మండలానికి వెళ్లారు. దీంతో కొత్తవారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. మండలంలో తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర, జిల్లా శాఖ ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయులకు, విద్యారంగానికి అవసరమైన సేవలు అందిస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కస్తూర్బా సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డికి ప్రిన్సిపాల్ నాగరాణి, సిబ్బంది వినతిపత్రం అందజేశారు. శనివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేను కలిశారు. తమ పాఠశాల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర్ సత్య కుమార్ గోపి తదితరులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థి మొక్కలను పెంచాలి : నాగరాజు


చేగుంట ఉన్నత పాఠశాలలో మొక్కలకు రాఖీ కడుతున్న విద్యార్థులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): ప్రతీ విద్యార్థి మొక్కలను నాటి పెంచాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాతావరణ సమతుల్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతీ విద్యార్థి మొక్కలను పెంచాలని సూచనలు చేశారు. మానవమనుగడకు మొక్కల గొప్పదనం వివరించి, మొక్కలకు రక్షణగా ఉంటామని రక్షాబంధన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరజ, లయన్స్ ప్రతినిధులు లింగమూర్తి, రామచంద్రం, సతీష్, నాగరాజు, సూర్యప్రకాశ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ


బొడ్మట్‌పల్లిలో పిచికారీ చేస్తున్న సిబ్బంది

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా శనివారం దోమల మందును పిచికారీ చేశారు. గ్రామంలోని మురుగు కాల్వల గుండా నీరు నిల్వ ఉండే గుంతల్లో దోమల మందును పిచికారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఏఎన్ఎం జయప్రద గ్రామంలో పర్యటిస్తూ.. వర్షాకాలంలో అనారోగ్యానికి గురికాకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు


చిట్కుల్ శివారులో డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులను పరిశీలిస్తున్న ఎస్ఐ యాదగిరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్ఐ యాదగిరి అన్నారు. శనివారం ఆయన సిబ్బందితో కలసి మండలంలోని చిట్కుల్ శివారులో వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీటలు వారుతున్న పొలాలు

ఆశించిన స్థాయిలో కురువని వర్షం | అడుగంటుతున్న భూగర్భ జలాలు | ఆందోళనలో కొల్చారం రైతులు


రెండు బోర్లు నడిస్తే పైపు నిండా రాని నీరు


దుంపలకుంట శివారులో బీటలు వారుతున్న వరి పొలం

కొల్చారం(నర్సాపూర్): నెల రోజులుగా ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదు. వర్షాధారంగా సాగు చేసిన పంటలకు తడులు లేకపోవడంతో చేన్లు వాడిపోతున్నాయి. ఎప్పుడూ వర్షం కురుస్తుందా.. అని రైతులు ఆకాశం వైపు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు పంటలపై చీడపీడల ప్రభావం అధికమవుతుంది. లోటు వర్షపాతం ప్రభావం పంట దిగుబడిపై పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొల్చారం మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. కొల్చారం మండలం అంటేనే వరికి పెట్టింది పేరు. దాదాపు 70 శాతం మేర బోర్లపై ఆధారపడి ఇక్కడ పంటలు సాగు చేస్తున్నారు. రెండు నెలలు అవుతున్నా.. ఇప్పటికీ సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. గడిచిన జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతానికి మైనస్ 4.8 లోటుగా నమోదైంది. దీంతో చెరువుకుంటల్లో నీరు చేరకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లల్లో నీరు తగ్గుముఖం పట్టింది. చాలా చోట్ల వరి పంట దెబ్బతినే పరిస్థితి కన్పిస్తుంది.

వరి పంట సాగు విస్తీర్ణం...

మండలంలో వానాకాలం వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 19,978 ఎకరాలు కాగా అదే స్థాయిలో పంట సాగు చేశారు. మండలంలో మంజీరా నది ప్రవహిస్తున్నా.. పరివాహక ప్రాంతం ఆరు నుంచి ఎనిమిది గ్రామాలకు పరోక్షంగా బోర్ల ద్వారా నీరందుతుంది. మంజీరాపై ఐదు ఎత్తిపోతల పథకాలు ఉన్నప్పటికీ వాటిలో చిన్నఘనాపూర్ పరిధిలో రెండు మాత్రమే 500 ఎకరాలకు నీరందిస్తుండగా, మిగతా మూడు ఎత్తిపోతల పథకాలు అలంకారప్రాయంగా తయారయ్యాయి. దీంతో రైతులు బోర్లపై ఆధారపడి వరి పంట సాగు చేస్తున్నారు.

నీరందడం లేదు



వర్షాకాలం వానలు దండిగా కురుస్తాయన్న నమ్మకంతో ఉన్న రెండు బోర్లు పంటకు నీరు అందిస్తాయన్న గంపెడాశతో ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ప్రస్తుతం పంట కంకి తొడిగే స్థాయికి వచ్చింది. వర్షం జాడ కానరాకపోవడం, బోర్లల్లో నీరు అడుగంటి, రోజులో గంట మాత్రమే నీరు పోస్తుండడంతో పొలానికి నీరందడం లేదు. – మల్లయ్య, రైతు, రంగంపేట

పొలం బీటలు వారుతుంది

వానదేవుడు ఇంత మోసం చేస్తాడనుకోలేదు. మూడు బోర్లు వేసి, వరి సాగు చేశా. బోర్ల నీళ్లకు తోడు వర్షాలు కురిసి పంట గట్టెక్కుతుందనుకున్న. ఇప్పుడు రెండింటికీ చెడ్డట్టైంది. బోర్లు పోయకపోవడం, అటు వర్షం కురవకపోవడంతో పంటకు నీరందక బీటలు వారి, ఎండు ముఖం పడుతోంది. ఇక పంటపై ఆశ వదులుకోవాల్సిందే. – శంకరయ్య, రైతు, ఎనగండ్ల

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


లబ్ధిదారునికి ఎల్ఓసీని అందిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, నాయకులు

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శివ్వంపేట మండలంలోని మల్లుపల్లి తండాకు చెందిన సునతీకు ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు నిరంతరం నిధులు కేటాయిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వెల్దుర్తి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ముక్తబాయితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు నవీన్ గుప్తా, కరుణాకర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కమల, మహేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రేగోడ్(మెదక్): సీఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు, ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్ అన్నారు. మండలంలోని మర్పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన రుక్మినికి రూ.54వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో కొత్వాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ గాండ్ల నర్సింలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మంగళపర్తి బస్టాండ్‌లో తలదాచుకుంటూ యాచకురాలుగా ఉంటున్న గుర్తుతెలియని వృద్ధురాలు కన్నుమూసింది. ఎస్ఐ రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్ సమీపంలో రెండు నెలలుగా ఓ వృద్ధురాలు(65) ఉంటుంది. తెలిసిన వారు భోజనం పెడితే అక్కడే ఉంటూ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తుంది. శనివారం ఉదయం బస్టాండ్‌లోనే విగతజీవిగా కనిపించడంతో ప్రయాణికులు గమనించి, సమాచారాన్ని పోలీసులకు అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ అడిగితే కొల్చారం అని చెప్పేదని, ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

రుణమాఫీపై బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ఆరోపణలు రైతులు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

యోగా పోటీల్లో టేక్మాల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టేక్మాల్(మెదక్): చేగుంట పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 23న నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు పథకాలను సాధించినట్లు వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. విజేతలను శుక్రవారం ప్రార్థన సమయంలో అభినందిస్తూ బహుమతులను అందించారు. విద్యార్థులతో పాటూ పీడీ గజేంద్రుల నర్సింలును సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విజయ్, జానకిరామ్, అశోక్, నాగేందర్, నాగరాజు, లీలా, అరుణ తదితరులు ఉన్నారు.

వైభవంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

108 కలశాల ఊరేగింపు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం సభ్యులు 108 కలశాలను వాసవీమాత ఆలయం వరకు తీసుకొచ్చి, అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అంతకుముందు పల్లకీలో వాసవీ మాత విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణంలో ఆర్యవైశ్య సంఘానికి చెందిన సభ్యులు పాల్గొన్నారు.


రామాయంపేటలో కలశాలతో మహిళలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పూజల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, పీసీసీ అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్

సంక్షిప్త వార్తలు

◆ 'రుణమాఫీతో బీఆర్ఎస్ నేతలకు నిద్రపట్టడంలేదు'

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ చేయడంతో బీఆర్ఎస్ నేతలకు నిద్రపట్టడంలేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారని, బీఆర్ఎస్ నాయకులే నిద్రపట్టక ఆగం ఆగం అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగపడే సూచనలను ప్రభుత్వానికి అందించాలని కోరారు.

◆ ఫ్రీజర్ అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): తమ తాత జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి సొంత నిధులతో యువకుడు ఫ్రీజర్‌ను అందజేశాడు. శనివారం మండల కేంద్రానికి చెందిన అంజయ్య యాదవ్ జ్ఞాపకార్థం మనవడు భాస్కర్ యాదవ్ ఫ్రీజర్‌ను గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రూపగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యువకుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, నాయకులు వెంకట్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, జావీద్‌పాషా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ అంగన్‌వాడీకి ఫర్నిచర్ బహూకరణ



శివ్వంపేట(నర్సాపూర్): పీఎంజీ యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రమైన శివ్వంపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నిచర్ బహూకరించారు. మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా పెద్ద కూతురు ఆరాధ్య జన్మదినం సందర్భంగా శనివారం పీఎంజీ యువసేన సభ్యులు కుర్చీలు, ఫర్నిచర్, ఆట వస్తువులు, తిను బండారాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, రాములుగౌడ్, సింహం, ఖదీర్, సుదర్శన్‌గౌడ్, షేక్‌అలీ రాజు,నగేష్, శ్యామ్, ప్రవీన్, నవీన్, తదితరులు ఉన్నారు.

◆ అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీబాల వీరహనుమాన్ ఆలయంలో శనివారం ఆలయ అర్చకుడు మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి చందన అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. దూలిపేటకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ గ్రామస్తులకు అన్నదానం చేశారు.

చాకరిమెట్లలో శ్రావణ సందడి

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహాయంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్, తదితరులు ఉన్నారు.


సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు


రామాయంపేట(మెదక్): ఉట్టి కొడుతున్న విద్యార్థులు


చేగుంట బ్రిలియంట్ పాఠశాలలో రాధాకృష్ణుల చిన్నారులు


మనోహరాబాద్(తూప్రాన్): కోలాటలో ..


తూప్రాన్: గీతా స్కూల్లో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట బ్రిలియంట్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో రాధాకృష్ణుడి వేషాలు వేయించి ఉట్టికొట్టించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, డైరెక్టర్లు సురేష్, ఆరిఫ్‌తో పాటు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మంజీరా విద్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కీర్తనలు, నృత్యాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని వీరహనుమాన్ కాలనీలోని చైతన్య భారతి పాఠశాలలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జుబేర్ అహ్మద్, ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణంలోని గీతా స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను జరుపుకొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాలాటలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్, పాలాట, కూచారం, ముప్పిరెడ్డిపల్లి తదితర పాఠశాలలో విద్యార్థులు, కృష్ణుడి వేషాలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.


మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో..


చిన్నశంకరంపేట: కృషి విజ్ఞాన పాఠశాలలో..

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

కౌడిపల్లి(నర్సాపూర్): వాహనదారులకు ప్రమాదకరంగా మారిన గుంతలను యూత్ సభ్యులు శ్రమదానం చేసి పూడ్చివేశారు. మండల కేంద్రం కౌడిపల్లి నుంచి వెల్మకన్నకు వెళ్లే బీటీరోడ్డుపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. వాహనదారులు సైతం గుంతలు గమనించక కిందపడి గాయాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. దీంతో స్పందించిన వెల్మకన్న అంబేడ్కర్ యూత్ సభ్యులు మహేశ్, రాజు, ప్రవీణ్, బాలు, రాహుల్ శనివారం తట్ట, పలుగు, పార చేత పట్టి రెండున్నర కిలోమీటర్ల పరిధిలో రోడ్డుపైన పలుచోట్ల ఉన్న పది గుంతులకు మట్టివేసి పూడ్చారు. దీంతో తాత్కలికంగా సమస్య తీరగా ప్రమాదాలు సైతం తప్పుతాయని చెప్పారు. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని కోరారు. యూత్ సభ్యులు శ్రమదనం చేసి, గుంతలు పూడ్చివేయడంతో గ్రామస్తులు అభినందించారు.


వెల్మకన్న దారిలో బీటీరోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చుతున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

ఓటరు జాబితా తయారీకి ఏర్పాట్లు


చిలప్‌చెడ్‌లో కార్యదర్శులతో మాటాడ్లుతున్న ఎంపీడీఓ ఆనంద్


పెద్దశంకరంపేట(మెదక్): ఓటరు జాబితా సిద్ధం చేస్తున్న గ్రామ కార్యదర్శులు

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితా సవరణ చేపట్టారు. వార్డుల వారీగా ఓటరు ముసాయిదా జాబితాను సిద్ధం చేసి, వచ్చే నెల 6న వెలువరించనున్నారు. ఇందులో భాగంగా పేట మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ఓటరు జాబితాలను కార్యదర్శులు సిద్ధం చేసే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వార్డుల వారీగా సిద్ధం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికలు 2024 ఓటర్ల జాబితాపై పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా గ్రామాల్లో ఏ వార్డుల్లో ఉన్న ప్రజలకు, అక్కడే ఓటు ఉండేలా చూడాలన్నారు. వచ్చే నెల 6న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా రూపకల్పన చేసి గ్రామ పంచాయతీలో ఉంచాలన్నారు. ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ఆ ఫిర్యాదులు స్వీకరించి, ఉన్నతాధికారులకు పంపించి, తుది జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగార్షక బుట్ట.. పత్తి పంటకు రక్ష

జగదేవ్‌పూర్(గజ్వేల్): లింగార్షక బుట్టలు పత్తి పంట రక్షకు దోహదపడుతాయని, పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వసంతరావు పిలుపునిచ్చారు. మండలంలోని చాట్లపల్లి రైతు వేదికలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గులాబీ పురుగు, సస్యరక్షణ చర్యలపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ పురుగు నివారణ కోసం రైతులు లింగార్షక బుట్టలను వాడాలన్నారు. మోతాదుకు మించి మందును పిచికారీ చేయవద్దని, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. 175 మంది రైతులకు లింగార్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణమూర్తి, ప్రేమ్‌సతీశ్, పుష్పమిత్ర, రాజేందర్, కోఆర్డినేటర్లు రమేశ్, రాము, శ్రీకాంత్, బాలకృష్ణ, గణేశ్, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధులు అఖిలేశ్, లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.